నేడు ఎమ్మెల్యే పల్లా పర్యటన

చేర్యాల, నవంబర్ 16: జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆదివారం చేర్యాల, ధూళిమిట్ట మండలాల్లో పర్యటించనున్నట్లు బీఆర్ఎస్ వర్గాలు తెలిపాయి. చేర్యాలలో కొనసాగుతున్న కనక దుర్గామాత మందిర ప్రథమ వార్షికోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని పూజలు చేయనున్నారు. చేర్యాల, ధూళిమిట్ట మండలాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ పార్టీల అభిమానుల పెండ్లిలు, శుభకార్యాల్లో ఎమ్మెల్యే పాల్గొననున్నారు.

గిరిజనుల అభివృద్ధికి కేసీఆర్ కృషి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

సిద్దిపేట, నవంబర్ 16: తండాలను గ్రామ పంచాయతీలుగా చేసి గిరిజనుల అభివృద్ధి కోసం కేసీఆర్ కృషి చేస్తే ఫార్మాసిటీ పేరు మీద గిరిజనుల భూములు స్వాధీనం చేసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి చూస్తున్నాడని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వీరనాయక్ ఆరోపించారు. శనివారం సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గిరిజన నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. కొడంగల్ నియోజకవర్గం లగిచర్లలోని గిరిజనుల భూములను ఫార్మాసిటీ కోసం ముఖ్య మంత్రి సోదరుడు తిరుపతిరెడ్డి అన్యాయంగా తీసుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. కంపెనీకి భూములు ఇవ్వడం ఇష్టంలేక ఎదురు తిరిగిన లంబాడీలను అర్ధ రాత్రి అరెస్టు చేయడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. మీడియా సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు బాలునాయక్, బండి శ్రీకాంత్, సీతారామ్‌నాయక్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే

బెజ్జంకి, నవంబర్ 16: మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు ఇబ్బంది కలగకుండా కొనుగోళ్లు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ, డిప్యూటీ డైరెక్టర్ ప్రసాదరావు, కార్యదర్శి వెంకటయ్య, వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

మాట్లాడుతున్న మణికంఠరెడ్డి

సిద్దిపేట, నవంబర్ 16: కాంగ్రెస్ పాలనలో విద్యారంగం పూర్తిగా నిర్లక్ష్యానికి గురవుతున్నదని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి ఆరోపించారు. శనివారం సిద్దిపేటలోని ఎడ్ల గురువారెడ్డి భవన్‌లో ఏఐఎస్ఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఫీజు బకాయిలు విడుదలకాక, ఉపకార వేతనాలు అందక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా విజయోత్సవాలకు ఖర్చు చేయడానికి ఉన్న డబ్బులు విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు లేవా అని ప్రశ్నించారు. విద్యార్థులకు ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా ఇప్పటి వరకు నెరవేర్చలేదన్నారు. గురుకుల పాఠశాలను ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నదని విమర్శించారు. బాసర ట్రిపుల్ ఐటీలో విద్యార్థుల ఆత్మహత్యలు ఆగడం లేదన్నారు. అధికారంలోకి రాగానే బాసర త్రిబుల్ ఐటీని సందర్శించి విద్యార్థుల సమస్యలు పరిష్కరిస్తానని చెప్పి, అధికారంలోకి వచ్చి 11 నెలలైనా ఇప్పటి వరకు వారి సమస్యలను పరిష్కరించలేదన్నారు. సిద్దిపేటలో ప్రభుత్వ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు సంగం మధు, జిల్లా ప్రధాన కార్యదర్శి జెర్రిపోతుల జనార్దన్, నాయకులు నరేశ్, శేఖర్, ప్రసన్న, నవీన్, యాసిన్, అనిరుధ్, అజయ్ పాల్గొన్నారు.

తెలంగాణ కార్మికులకు ఉపాధి కరువు

మాట్లాడుతున్న దరిపల్లి చంద్రం

సిద్దిపేట టౌన్, నవంబర్ 16: వలస కార్మికులతో తెలంగాణ భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కరువైందని భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దరిపల్లి చంద్రం ఆవేదన వ్యక్తం చేశారు. సిద్దిపేట టీబీఎన్ ఆర్‌కేఎస్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వలస కార్మికులను వారి స్వస్థలాలకు పంపించి స్వరాష్ట్ర కార్మికులకు పని కల్పించే గొప్ప సంకల్పంతో ప్రణాళికలు రూపొందించామన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉమ్మడి పది జిల్లా కేంద్రాల్లో సభలు నిర్వహించేందుకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు.ఈ నెల 20న వరంగల్‌లో సన్నాహక సభ నిర్వహించనున్నామని స్పష్టం చేశారు. సమావేశంలో కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఆకుల ప్రశాంత్,రాష్ట్ర కార్యదర్శి పరశురాములు, సుతారి సంఘం సిద్దిపేట అధ్యక్షుడు తోట్ల నర్సింహులు, దరిపల్లి ఎల్లం, కిషన్, ఎల్లం పాల్గొన్నారు.

కొనసాగుతున్న కులగణన సర్వే

హుస్నాబాద్‌టౌన్: పట్టణంలో కులగణన సర్వేచేస్తున్న ఎన్యూమరేటర్

గురువన్నపేటలో సర్వేను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో మల్లికార్జున్‌రెడ్డి

హుస్నాబాద్‌టౌన్, నవంబర్ 16: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన సర్వే శనివారం కొనసాగింది. పట్టణంలోని 20 వార్డుల్లో నిర్వహిస్తున్న కులగణన సర్వేలో భాగంగా ఇంటింటికి వెళ్లి ఉపాధ్యాయులు, వార్డు అధికారులు, మెప్మా ఆర్పీలు ప్రజల నుంచి సమాచారాన్ని సేకరించారు. కులగణన సర్వేలోని పలు వివరాల నమోదుకు గంట సమయం పడుతున్నదని, దాంతో త్వరగా పూర్తిచేసేందుకు ఇబ్బందులు పడుతున్నామని ఎన్యూమరేటర్లు వాపోతున్నారు.

సర్వేను పరిశీలించిన డీఎల్‌పీవో మల్లికార్జున్‌రెడ్డి

కొమురవెల్లి, నవంబర్ 16: మండల వ్యాప్తంగా ఇంటింటి కుటుంబ సర్వే కొనసాగుతున్నది. శనివారం మండలంలోని గురువన్నపేటలో జరుగుతున్న సర్వేను డీఎల్‌పీవో మల్లికార్జున్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే జరుగుతున్న తీరును ఎన్యూమరేటర్లను అడిగి తెలుసుకోవడంతో పాటు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల అధికారులు, ఎన్యూమరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

అక్షయ్‌కుమార్‌కు అభినందనల వెల్లువ

అక్షయ్‌కుమార్, పీఈటీని సన్మానిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు కృష్ణవేణి

కోహెడ, నవంబర్ 16: పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో జరుగుతున్న క్రీడల్లో అండర్ 14 ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొనేందుకు మండలంలోని వరికోలు ఉన్నత పాఠశాలలో చదువుతున్న గండికోట అక్షయ్‌కుమార్ ఎంపికయ్యాడని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కృష్ణవేణి తెలిపారు. ఎంపికైన విద్యార్థి అక్షయ్‌కుమార్, పీఈటీని శాలువా కప్పి అభినందించారు.

త్వరలో కొత్త భవనంలోకి చేర్యాల సర్కారు దవాఖాన

చివరి దశకు పనులు

నూతన దవాఖాన భవనానికి రంగులు వేస్తున్న కార్మికులు

చేర్యాల, నవంబర్ 16: చేర్యాల పట్టణంలోని బీడీ కాలనీ వద్ద రూ.8కోట్ల పైచిలుకు నిధులతో నిర్మిస్తున్న ప్రభుత్వ దవాఖాన నూతన భవనం పనులు చివరి దశకు చేరుకున్నాయి. త్వరలో చేర్యాల ప్రభుత్వ దవాఖాన పాత భవనం నుంచి నూతన భవనంలోకి మార నున్నది. నూతన భవనంలో ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు అన్ని వసతులు కల్పించారు. రోగులతో పాటు వైద్యులు, సిబ్బందికి అన్ని హంగులు, వసతులతో కూడిన భవనం అందుబాటులోకి రానుండడంతో చేర్యాల ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు నాటి వైద్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు చేర్యాలలో నూతనంగా సర్కారు భవనం నిర్మించేందుకు రూ.8కోట్ల 70లక్షలు మంజూరు చేశారు. వైద్యశాఖ మంత్రిగా పనిచేస్తున్న సమయంలో మంత్రి హరీశ్‌రావు చేర్యాలలో ప్రస్తుతం వైద్య సేవలు అందిస్తున్న దవాఖాన భవనాన్ని సందర్శించి వైద్యులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ దవాఖాన పరిస్థితులు గమనించిన ఆయన చేర్యాలలో నూతన భవనం అవసరమని వెంటనే కొత్తగా భవనం మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అప్పటి మంత్రి హరీశ్‌రావు ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి తదితరులతో కలిసి జనవరి 10, 2023లో పనులకు శంకుస్థాపన చేశారు.నాడు టెండరు ద్వారా పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు నత్తనడక కొనసాగిస్తున్న విషయాన్ని తెలుసుకున్న ప్రస్తుత ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సంబంధితశాఖ అధికారులతో మాట్లాడి సకాలంలో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.త్వరలో నూతన భవనంలోకి చేర్యాల దవాఖాన మార నున్నది. ప్రస్తుతం ఉన్న దవాఖాన భవనంలో మున్సిపాలిటీ కార్యాలయం ఏర్పాటు చేస్తే సౌకర్యంగా ఉంటుందని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇతర ప్రభుత్వ కార్యాలయాల కోసం బీఆర్ఎస్ పాలనలో మంజూరు చేసిన సమీకృత ప్రభుత్వ కార్యాలయాల భవనం రెడీ అవుతుండడంతో అన్ని కార్యాలయాలు త్వరలో అందులోకి రానున్నాయి. ప్రస్తుతం మున్సిపల్ కార్యాలయం బీసీ వసతి హాస్టల్‌లో కొనసాగుతున్నది. గతంలో మున్సిపల్ కార్యాలయం ఉన్న ప్రదేశంలో వెజ్ నాన్‌వెజ్ మార్కెట్ నిర్మిస్తుండడంతో మున్సిపల్ కార్యాలయం కాస్తా బీసీ హాస్టల్‌కు మారింది.

నేడు, రేపు గ్రూప్-3 పరీక్ష

సిద్దిపేట కలెక్టరేట్, నవంబర్16: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రూప్-3 పరీక్షకు జిల్లా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. పరీక్ష ఆదివారం, సోమవారం నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలో మొత్తం 37 సెంటర్లలో 13,408 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు నిర్వహించేందుకు సిద్దిపేట సీపీ అనురాధ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పరీక్ష ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకు మధ్యాహ్నం 3 గంటల నుంచి 5.30 గంటల వరకు నిర్వహించనున్నారు. అభ్యర్థులు సమయానికి రెండు గంటల ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని,అరగంట ముందే సెంటర్ గేట్లు మూసివేస్తామని అధికారులు తెలిపారు. పరీక్ష కేంద్రాల సమీపంలోని జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లు మూసివేయాలని సూచించారు. పరీక్ష కేంద్రాల చుట్టూ పటిష్టమైన బందోబస్తుతోపాటు పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేశారు.పరీక్ష కేంద్రాల వద్ద విధులు నిర్వహించే అధికారులకు కమిషనర్ కార్యాలయంలో పరీక్ష నోడల్ అధికారి ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్‌తోకలిసి సీపీ దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో సిద్దిపేట ఏసీపీలు, సీఐలు,ఎస్సైలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీపీ అనురాధ

ప్రగతి చక్రం అవార్డుల ప్రదానం

అవార్డు అందజేస్తున్న ప్రభులత

బస్సుపాసులు అందజేస్తున్న అధికారులు

సిద్దిపేట టౌన్, నవంబర్ 16 : సంస్థ అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రతిభా వంతులకు ప్రగతి చక్రం అవార్డులు అందజేస్తూ ప్రోత్సహిస్తున్నామని మెదక్ ఆర్టీసీ డిపో రీజినల్ మేనేజర్ ప్రభులత అన్నారు. సిద్దిపేట ఆర్టీసీ డిపోలో శనివారం వృత్తిలో నైపుణ్యం కనబర్చి సంస్థకు లాభాలు తెచ్చిన 23 మంది సిద్దిపేట, దుబ్బాక ఉద్యోగులకు ప్రగతి చక్రం అవార్డులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ సుఖేందర్‌రెడ్డి,ఉద్యోగులు మహేశ్వరి,రంజిత్‌కుమార్, కనకలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రయాణం ఎంతో సురక్షితం

రాయపోల్, నవంబర్ 16: ఆర్టీసీ ప్రయాణం ఎంతో సురక్షితమని ఆర్టీసీ విలేజ్ బస్సు అధికారులు జయేందర్‌రెడ్డి, ఆర్‌పీరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని పెద్దఆరెపల్లిలో గజ్వేల్, ప్రజ్ఞపూర్ డిపో ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఆర్టీసీ రాయితీపై బస్సుపాసులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ మాజీ ఉప సర్పంచ్ కిరణ్‌కుమార్,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో ఆరుగురికి రిమాండ్

- వివరాలు వెల్లడించిన గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి

మాట్లాడుతున్న గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి

తొగుట, నవంబర్ 16: తొగుట మండలంలోని వాగ్గడ్డ వద్ద పిట్ల రాజుపై ఈనెల 11న జరిగిన హత్యాయత్నం ఘటనలో ఆరుగురిని రిమాండ్ చేసినట్లు గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి తెలిపారు. తొగుట పీఎస్‌లో సీఐ లతీఫ్, ఎస్సై రవికాంతరావుతో కలిసి శనివారం విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. తొగుట మండలంలోని లక్ష్మాపూర్‌కు చెందిన చందననేని కనకయ్య పెద్దమ్మ దేవాలయంలో అవకతవకలకు పాల్పడ్డాడని, మాజీ సర్పంచ్ కొల్చెల్మ స్వామి, తన తమ్ముడు కరుణాకర్‌కు ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో కేటాయించిన ప్లాట్ల గురించి అదే గ్రామానికి చెందిన పిట్ల రాజు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టాడు. ఈ విషయాన్ని మనుసులో పెట్టుకున్న ఈ ముగ్గురు రాజును అడ్డు తొలిగిస్తే తమను ప్రశ్నించేవారు ఉండరని భావించారు. ఈ విషయాన్ని చందననేని కనకయ్య తుక్కాపూర్‌కు చెందిన సన్నిహితుడు గండ్యాల నగేశ్‌ను సంప్రదించగా డబ్బులు ఇస్తే చేయిస్తానని ఒప్పుకున్నాడు. ఈ విషయాన్ని నగేశ్ రాంపూర్‌కు చెందిన జంగిటి భిక్షపతిని సంప్రదించడంతో అతను చేయి కలిపి పెద్దమాసాన్‌పల్లి మధిర ఇంద్రానగర్‌కు చెందిన కడారి సాగర్‌కు తెలుపగా సాగర్ తన స్నేహితులు గణేశ్, ఫిరోజ్, వాజిద్, మురళీ కృష్ణతో రాజును హతమారుస్తామని వారి నుంచి రూ.50వేలు తీసుకున్నారు. రాజు హత్య కోసం తొగుట వైస్స్ వద్ద ఒక రోజు ముందు ప్రణాళిక రచించారు. పథకం ప్రకారం ఈనెల 11న సాయంత్రం ఐదు గంటలకు సాగర్ అతని స్నేహితులు వాగ్గడ్డ నుంచి మల్లన్న సాగర్‌కు వెళ్లేదారిలో రాజు కాలినడకన వెళ్తుండగా ద్విచక్రవాహనాలపై వెళ్లి బీరు బాటిళ్లతో దాడి చేశారు. రాజుకు రక్తస్రావం కావడంతో పాటు పడిపోవడంతో చనిపోయాడని భావించి వెళ్లిపోయారు. కొద్ది సేపటికి తేరుకున్న రాజు రక్తస్రావంతో రోడ్డు మీదికి రావడంతో స్థానికులు దవాఖానకు తరలించారు. రాజు తండ్రి పిట్ల శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించి దోషులను గుర్తించారు. ఈకేసులో లక్ష్మాపూర్‌కు చెందిన చందననేని కనకయ్య, కొల్చెల్మ కరుణాకర్, తుక్కాపూర్‌కు చెందిన గండ్యాల నగేశ్, సిద్దిపేటకు చెందిన ఎండీ ఫిరోజ్‌ను అరెస్టు చేసి సిద్దిపేట కోర్టుకు తరలించినట్లు తెలిపారు. ఇద్దరు మైనర్లు ఉండడంతో వారిని జువైనల్ జస్టిస్ బోర్డు సంగారెడ్డికి తరలించగా మిగతా నలుగురు పరారీలో ఉన్నారని తెలిపారు. హత్యాయత్నం కేసులో చాకచాక్యంగా వ్యవహరించి కేసును త్వరగా ఛేదించిన సీఐ లతీఫ్, ఎస్సై రవికాంతరావును ఆయన ప్రశంసించారు.

సఖీ, భరోసా సెంటర్లను సందర్శించిన జడ్జి

సఖీసెంటర్ సిబ్బందితో జడ్జి స్వాతిరెడ్డి

సిద్దిపేట టౌన్,నవంబర్ 16 : సిద్దిపేట సఖీ, భరోసా సెంటర్లను జడ్జి స్వాతి రెడ్డి శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా సఖీ,భరోసా కేంద్రాల్లో సదపాయాలు,సౌకర్యాలను ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు. సెంటర్ రిజిస్టర్లను పరిశీలించారు. కార్యక్రమంలో సెంటర్ల సిబ్బంది పాల్గొన్నారు.

సహకార రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

మిరుదొడ్డి సహకర బ్యాంకులో చైర్మన్, డైరెక్టర్లతో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీసీవో నాగేశ్వరావు

మిరుదొడ్డి, నవంబర్ 16: తక్కువ వడ్డీతో సహకార బ్యాంకులో రైతులు రుణాలు తీసుకొని ఆర్థికంగా లబ్ధిపొందాలని సహకార బ్యాంకు డీసీవో నాగేశ్వరరావు అన్నారు. శనివారం సహకార బ్యాంకు వారోత్సవాలను పురస్కరించుకొని సహకార జెండాను ఆయన ఆవిష్కరించి చైర్మన్, డైరెక్టర్లతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా డీసీవో మాట్లాడుతూ డైరెక్టర్లు సహకార సంఘం అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డైరెక్టర్లు నర్సింహులు, యాదయ్య, రైతులు పాల్గొన్నారు.

రేణుకది ముమ్మాటికీ హత్యే: డీబీఎఫ్

రేణుక తల్లిదండ్రులను పరామర్శిస్తున్న డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్

గజ్వేల్, నవంబర్ 16: వర్గల్ మండలం మాదారం గ్రామానికి చెందిన దళిత యువతి రేణుకది ఆత్మహత్య కాదు హత్య చేశారనే అనుమానం వ్యక్తమవుతున్నదని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ అన్నారు. శనివారం గజ్వేల్‌లోని మార్చురీ వద్ద రేణుక కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్గల్ మండల మైలారం గ్రామానికి చెందిన భానును నాలుగు నెలల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నప్పటి నుంచి కుల వివక్ష చూపించారన్నారు. అనుమానాస్పదస్థితిలో మరణించిందని కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నందున మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఎగొండస్వామి ఉన్నారు.

ప్రభుత్వ స్కూళ్లను బలోపేతం చేయాలి

దుబ్బాక, నవంబర్ 16: విద్యార్థులకు గుణాత్మక విద్యనందించి ,ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేసేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. శనివారం మండలంలోని ఆకారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, లచ్చపేటలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను ఆయన సందర్శించారు. ఉపాధ్యాయుల బోధనతో పాటు విద్యార్థుల విషయ పరిజ్ఞానాన్ని పరిశీలించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఆయన వెంట ఎంఈవో ప్రభుదాస్ ఉన్నారు.

విద్యార్థులకు స్పోర్ట్స్ దుస్తులు, ఐడీ కార్డులు పంపిణీ

విద్యార్థులకు స్పోర్ట్స్ దుస్తులు, ఐడీ కార్డులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

తొగుట, నవంబర్ 16: మండలంలోని గుడికందుల ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు స్పోర్ట్స్ దుస్తులు, ఐడీ కార్డులను ప్రధానోపాధ్యాయుడు పి.అంజిరెడ్డి, ఉపాధ్యాయులు అందజేశారు. వీఎంఆర్ ట్రస్ట్ అధినేత, పీఆర్టీయూ బలపర్చిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి సౌజన్యంతో 116 మంది విద్యార్థులకు స్పోర్ట్స్ దుస్తులు, ఐడీకార్డులు అందజేశారు. కార్యక్రమంలో సోమగారి నాగిరెడ్డి, పాతిరెడ్డి, హనుమారెడ్డి, పరపాటకం అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు

పరిస్థితి విషమించి వ్యక్తి మృతి

మిరుదొడ్డి (అక్బర్‌పేట-భూంపల్లి నవంబర్ 16: పురుగుల మందు తాగి చికిత్స పొందుతున్న వ్యక్తి దవాఖానలో పరిస్థితి విషమించి మృతిచెందిన సంఘటన అక్బర్‌పేట భూంపల్లి మండలం అల్మాజిపూర్‌లో చోటు చేసుకుంది. భూంపల్లి ఎస్సై హరీశ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కనిక రాజయ్య(51) వ్యవసాయ పనులు చేసుకుంటూ కుటుంబీకులతో కలిసి జీవనం కొనసాగిస్తున్నాడు. కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యతో బాధపడుతూ భార్యతో చెప్పుకునేవాడు. ఈనెల 15న ఉదయం వ్యవసాయ పొలం వద్దకు వెళ్లివస్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. ఉదయం 11 గంటల సమయం దాటినా ఇంటికి రాకపోగా కుమారుడు ప్రశాంత్ బావి వద్దకు వెళ్లగానే పురుగుల మందు తాగి పొలంలో ప్రాణాపాయ స్థితిలో రాజయ్య కొట్టుమిట్టాడుతున్నాడు. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. వైద్యులు సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని గాంధీ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం పరిస్థితి విషమించి మృతిచెందాడు. మృతుడి భార్య ఎల్లవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్కరాములు

చేర్యాల మహాసభలో మాట్లాడుతున్న చుక్క రాములు

చేర్యాల, నవంబర్ 16: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ సర్కారు అమలు చేయకపోవడమే ప్రజాపాలనా అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చుక్క రాములు ప్రశ్నించారు. పట్టణంలోని ఈడెన్ గార్డెన్స్‌లో సీపీఎం మండల ఎనిమిదో మహాసభలు శనివారం గొర్రె శ్రీనివాస్, రేపాక కుమార్, గోగుల చంద్రకళ అధ్యక్షతన జరిగాయి.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ప్రజలకు అనేక హామీలు ఇచ్చాయని వాటిని అమలు చేయడంలో విఫలమయ్యాయని ఆరోపించారు.కాంగ్రెస్ సర్కారు అమలు చేస్తామని చెప్పిన ఆరు గ్యారెంటీల్లో కేవలం ఉచిత బస్సు సౌకర్యం మినహా ఏదీ అమలు కాలేదన్నారు. 40 శాతం మంది రైతులకు పంట రుణ మాఫీ కాలేదని, 60శాతం మంది రైతులు అనేక కారణాల పేరుతో రుణమాఫీకి నోచుకోలేదన్నారు. మహిళలకు రూ.2500 ఇప్పటికీ జమ కాలేదని, ఇండ్లు, ఇండ్ల స్థలాల జాడ లేదన్నారు. హైడ్రా పేరుతో హైడ్రామా చేస్తూ పేదల ఇండ్లు కూల్చి ప్రజల దృష్టిని మరల్చాలని చూస్తే ఊరుకోరని హెచ్చరించారు. ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల పై ప్రజాపోరాటాలు నిర్మిస్తామన్నారు. ఈ సందర్భంగా చుక్క రాములు జెండాను ఆవిష్కరించారు.మహాసభల్లో జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, వర్గ సభ్యులు కాముని గోపాలస్వామి, రాళ్లబండి శశిధర్, శెట్టిపల్లి సత్తిరెడ్డి, కొంగరి వెంకట్‌మావో, బండకింది అరుణ్‌కుమార్, బద్దుపడిగ కృష్ణారెడ్డి, తాడూరి రవీందర్, దాసరి ప్రశాంత్, అత్తిని శారద, ఆలేటి యాదగిరి, మోకు దేవేందర్‌రెడ్డి, మల్కని ఎల్లయ్య, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రకళ పాల్గొన్నారు.

చేర్యాలలో బోనాలు

బోనం తీసుకుపోతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణి

చేర్యాల, నవంబర్ 16: పట్టణంలోని కనకదుర్గామాత మందిర ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా రెండు రోజులుగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.శనివారం ఉత్సవాల్లో భాగంగా పట్టణానికి చెందిన అన్ని వార్డుల ప్రజలు గ్రామ దేవతలకు బోనాలు సమర్పించారు.

నేడు సదర్ వేడుకలు

సిద్దిపేట, నవంబర్ 16: హైదరాబాద్ లాంటి మహానగరాల్లో నిర్వహించే సదర్ వేడుకలను సిద్దిపేటలో నిర్వహించనున్నామని కమిటీ సభ్యులు నరసింహులు, అజయ్ తెలిపారు. శనివారం సిద్దిపేటలోని బొర్రా హనుమాన్ దేవాలయం వద్ద వారు మాట్లాడారు. సిద్దిపేట బొర్రా హనుమాన్ దేవాలయ ప్రాంగణంలో ఆదివారం సాయంత్రం 4 గంటలకు వేడుకలు జరుగుతాయని, మాజీ మంత్రులు హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డితో పాటు హైదరాబాద్‌కు చెందిన పలువురు ప్రముఖులు హాజరవుతారని తెలిపారు.

ట్రాన్స్‌కో ఏఈగా రాజు

మద్దూరు(ధూళిమిట్ట), నవంబర్16: మద్దూరు మండలానికి చెందిన కె. రాజు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ధూళిమిట్ట ట్రాన్స్‌కో ఏఈగా పనిచేసిన శ్రీనివాసరావు బదిలీపై పటాన్‌చెరుకు వెళ్లగా ఆయన స్థానంలో దుబ్బాకలో సబ్‌ఇంజినీర్‌గా పనిచేస్తున్న రాజు ఉద